క్లుప్తంగా

కరకట్ట పరిశీలన



కరకట్ట పరిశీలిస్తున్న వీఆర్వో రామారావు

జలుమూరు: సైరిగాం పంచాయతీ పరిధి లింగన్నాయుడుపేట కరకట్ట పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖకు నివేదించనున్నామని తహసీల్దర్ జెన్ని రామారావు అన్నారు. వంశధార కరకట్ట ధ్వంసం అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు స్థానిక వీఆర్వో ఎస్.రామారావును కరకట్ట పరిశీలించాలని ఆదేశించారు. గతంలో ఇసుక తవ్వకాలు జరిగే సమయంలో కూడా ఇదే కరకట్ట ధ్వంసం అయినట్లు స్థానికుల ద్వారా సమాచారం సేకరించామన్నారు. అలాగే నదిలో ఇసుక తరలింపునకు రోడ్డు మార్గం ఏర్పాటు చేయడంపై కూడా పరిశీలించినట్లు పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సాయిరాజ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న రెడ్డి శాంతి

మెళియాపుట్టి: ఇటీవల అనారోగ్యంలో మృతి చెందిన ఎండీయూ ఆపరేటర్ సలాన సాయి రాజ్ కుటుంబాన్ని వసుంధర గ్రామంలో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం పరామర్శించారు. అతిచిన్న వయస్సులోనే సాయిరాజ్ మృతి చెందడం బాధాకరమన్నారు. ఆ కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు. ఆమెతోపాటు మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, కోప్షన్ సభ్యుడు భాస్కర్ దాస్, ఎంపీటీసీ సలాన చిట్టి, పోలాకి జయమునిరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ చైతన్య పరామర్శ



పెద్దగుజ్జువాడలో పరామర్శిస్తున్న కృష్ణ చైతన్య తదితరులు

సారవకోట: మండలంలోని పలు కుటుంబాలను పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య శుక్రవారం పరామర్శించారు. చిన్నగుజ్జువాడ గ్రామంలో ఇప్పి రత్తమ్మ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను, పెద్దగుజ్జువాడ గ్రామానికి చెందిన కొండాల ఆదినారాయణ మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను, అలుదులో పాగోటి దమయంతి మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి తన సంతాపాన్ని తెలియజేశారు. ఆయనతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీ కృష్ణ, డీఎల్‌డీఏ మాజీ చైర్మన్ నక్క తులసీదాస్, సర్పంచ్ సాగిపల్లి దండాసి, పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు, గెల్లంకి వెంకటరావు, గొర్లె ఢిల్లీరావు, ధర్మాన రామకృష్ణ, కల్యాణం శ్రీను తదితరులున్నారు.

విద్యార్థులకు ప్రోగ్రస్ కార్డులు



మండలానికి వచ్చిన ప్రోగ్రస్ కార్డులు

నరసన్నపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రోగ్రస్ కార్డులను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈ మేరకు 82 స్కూల్స్‌లో చదువుతున్న విద్యార్థులకు 5,139 కార్డులు మండలానికి వచ్చాయని, వీటిని ఆయా స్కూల్స్‌కు పంపిణీ చేశామని ఎంఈవో శాంతారావు తెలిపారు. డిసెంబర్ 7వ తేదీన స్కూల్స్‌లో నిర్వహించనున్న విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఈ కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. వీటిలో విద్యార్థి ప్రమాణాలు, పరీక్షల్లో సాధించిన మార్కులు పొందుపరిచనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతగా ఈ కార్డులను నింపి, పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఆధార్ సెంటర్ల పరిశీలన



పాతపట్నంలోని ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీవో విమలరాణి

పాతపట్నం: మండలంలోని పాతపట్నం, కొరసవాడ, పెద్దలోగిడిల్లో ఉన్న ఆధార్ సెంటర్లను ఐసీడీఎస్ పీవో టి.విమలరాణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలందరూ ఆధార్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆమెతో పాటు సూపర్‌వైజర్ అనూరాధ, కార్యకర్తలు ఉన్నారు.

సచివాలయం.. సేవలు నిర్వీర్యం..!

- వెలవెలబోతున్న సచివాలయాలు
- ప్రైవేటుకు పలు సేవలు కేటాయింపు
- మండల కేంద్రాల్లో ప్రజల ప్రదక్షిణలు



వెలవెలబోతున్న బూరగాం గ్రామ సచివాలయం



ఒక్కరే ఉన్న కొరసవాడ గ్రామ సచివాలయం

పాతపట్నం: ప్రజల వద్దకే పాలన, గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన గ్రామ సచివాలయాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన ఈ వ్యవస్థపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. ఫలితంగా నాడు కళకళలాడిన సచివాయాలు నేడు వెలవెలబోతున్నాయి. గ్రామాల్లో సచివాలయాలను నిర్మించడంతో పాటు అన్ని రకాల సేవలు ప్రజల వద్దకే వచ్చేలా గత ప్రభుత్వం 10 నుంచి 12 మంది ఉద్యోగులను నియమించింది. వ్యవసాయ, పశు సంవర్ధక, విద్య, పరిపాలన శాఖలకు సంబంధించిన కార్యదర్శులను భర్తీ చేసింది. ఈ ఉద్యోగులు సచివాలయాల్లో ఉంటూ ప్రజలకు అవసరమైన సేవలతో పాటు సకాలంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు నుంచి ఆదాయ, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలు వరకూ 500లకు పైగా సేవలను అందించేవారు. వీరికి తోడు గ్రామ, వార్డు వలంటీర్లు గ్రామాల్లోని సమాచారాన్ని సచివాలయాలకు చేరవేయడం, ప్రభుత్వ పథకాలను ఇళ్ల వద్దకే అందజేయడం చేసేవారు.

ఇప్పుడు ప్రైవేట్ ఏజెన్సీలకు

గతంలో సచివాలయాల ద్వారా అందించే సేవలు ప్రస్తుతం నిలిచిపోయాయి. గ్రామ, వార్డు వలంటీర్ల సేవలు సచివాలయ ఉద్యోగులు చేయాల్సి వస్తోంది. ఇవే కాకుండా ఇతర సర్వేలు, పర్యవేక్షణ పనులను సైతం సచివాలయ ఉద్యోగులకే అప్పగించారు. అలాగే ప్రజలకు ఇంటి వద్ద అందే సేవలను ప్రైవేట్ నెట్‌వర్క్‌లకు, ఏజెన్సీలకు కేటాయించారు. ఫలితంగా గతంలో సచివాలయాల్లో లభించిన ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు, 1–బీల అప్లికేషన్స్ వంటివి ఇప్పుడు బయట మీసేవా కేంద్రాలు, ఈ నెట్‌వర్క్ సెంటర్లలో లభిస్తున్నాయి. దీంతో ప్రజలు ప్రైవేట్ నెట్‌వర్క్ సెంటర్ల వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవడంతో పాటు వాటిని పొందేందుకు మండల కేంద్రాల్లోని రెవెన్యూ కార్యాలయాలు, పరిషత్ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉండాల్సిన ఉద్యోగులు ఇతర సేవలు నిమిత్తం బయట తిరుగుతున్నారు. ప్రస్తుతం సచివాలయాల సేవలు 370కు కుదించేశారు.

నిర్మాణాలపై నీలినీడలు

గత ప్రభుత్వం ఒక్కో పంచాయతీకి రూ.1 కోటి విలువ చేసే పక్కా భవనాలను నిర్మించగా, కొన్ని చోట్ల ఈ నిర్మాణాలు పూర్తి కాలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ నిర్మాణాలను పూర్తిగా విస్మరిస్తోంది. రైతు సేవా కేంద్రాలైతే కొన్ని ప్రాంతాల్లో తెరుచుకోని పరిస్థితి ఉంది. కొంతమంది సచివాలయ ఉద్యోగులను సుదూర ప్రాంతాలకు బదిలీ చేసి, ఇబ్బందులు పెట్టే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు వలంటీర్ వ్యవస్థ కూడా నీరుగారడంతో ప్రజలకు సకాలంలో సేవలు అందే పరిస్థితి లేదు.

సేవలు యథాతథం



గ్రామ సచివాలయ సేవలు గతంలో మాదిరిగానే అందిస్తున్నాం. కొన్ని రకాల సేవలు ప్రైవేట్ నెట్ సెంటర్లు చేసుకునే విధంగా ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో ఎక్కువ మంది మీసేవ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా సచివాలయాలకు డిమాండ్ తగ్గింది. సచివాలయ ఉద్యోగులు మాత్రం పూర్తిస్థాయిలో తమతమ శాఖల విధులు కొనసాగించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– టి.చంద్రకుమారి, ఎంపీడీవో, పాతపట్నం

రాజకీయ లబ్ధి కోసమే వర్గీకరణ



పాతపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సీలు

పాతపట్నం: రాజకీయ లబ్ధి కోసమే ఎస్సీలను వర్గీకరించేందుకు ప్రభుత్వాలు ఉత్సాహాన్ని చూపిస్తున్నాయని మాల మహానాడు మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో పాతపట్నంలో ఎస్సీలు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పీఆర్ బంగ్లా నుంచి సెయింటెన్స్ స్కూల్ మీదుగా బస్టాండ్, మార్కెట్, ఆల్ ఆంధ్రా రోడ్, ఆస్పత్రి జంక్షన్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు లక్ష్మీనారాయణ, శిర్ల జోగారావు, శిర్ల ప్రభాకరరావు, యజ్జల భాస్కరరావు, నవగాన రత్నకుమార్, బసవల రవి, మురళీలు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని అభిప్రాయపడ్డారు. వర్గీకరణకి వ్యతిరేకంగా మేధావులు గొంతెత్తుతున్నా, ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వర్గీకరణ కారణంగా మాలలకి అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ర్యాలీలో పాతపట్నం, హరిజన గోపాలపురం, అంతరాబ, బగదల, గురండి, తంప గ్రామస్తులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

ఆమదాలవలస: నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని దన్నానపేట వద్దనున్న పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు నియోజకవర్గంలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, ఐటీఐను తొందరలోనే ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. జాబ్‌మేళాకి ఐదు ప్రైవేటు సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించి 32 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. అనంతరం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ లే అవుట్లు, 2.0 హౌసింగ్ సర్వేపై రెవెన్యూ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మండల సచివాలయ సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నెపు గోపి, ఈసీఈ విభాగాధిపతి శ్రీనివాసరావు, ఎంపీటీసీ గొర్లె సూర్యం, తహసీల్దార్ ఎస్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వంట కుక్ పోస్టులకు ఇంటర్వ్యూలు

పాతపట్నం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కుక్, కుక్ సహాయకుల పోస్టులకు శుక్రవారం ఇంటర్వ్యూలను నిర్వహించారు. పాతపట్నం ప్రభుత్వ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో వంట చేయడానికి వంట కుక్ పోస్టులు రెండు, అసిస్టెంట్ కుక్ పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహించామని ఎంఈవో గోవిందరావు తెలిపారు. ఎంపీడీవో చంద్రకుమారి, డీటీ వాన శంకర్, ఎంఈవో–2 తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

ధాన్యం.. దైన్యం

- అకాల వర్షంతో అన్నదాత ఆందోళన

ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో శుక్రవారం పలుచోట్ల కురిసిన వర్షాలకు రైతులు అవస్థలు పడ్డారు. కోసిన ధాన్యపు పనలు పొలాల్లో నుంచి కల్లాలకు చేర్చే క్రమంలో కొన్నిచోట్ల తడిసిపోయాయి. అదేవిధంగా కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని కుప్పలుగా వేసి టార్పాలిన్లతో కప్పి జాగ్రత్త చేసుకున్నారు. ఇంకా కోతకు సిద్ధంగా ఉన్న పంట పొలాల్లోని ధాన్యం ఏమైపోతాయోనని ఆందోళన చెందుతున్నారు. ఓవులు నేల వాలిపోతే ధాన్యం తడిసి పాడైపోతాయని ఆవేదనకు గురవుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జలుమూరు: తిమడాం వద్ద ధాన్యం కుప్పలను టార్పలిన్లతో కప్పిన దృశ్యం



ఎల్.ఎన్.పేట: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షం



పాతపట్నం: కొరసవాడలో చిరుజల్లులు పడుతున్న దృశ్యం



మెళియాపుట్టి: చాపర వద్ద టార్పాలిన్లతో కప్పి ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్న దృశ్యం



పాతపట్నం: కాగువాడలో జాతీయ రహదారిపై ధాన్యాన్ని టార్పలిన్‌తో కప్పిన దృశ్యం



ఎల్.ఎన్.పేట: గొట్టిపల్లి వద్ద వరిచేను కుప్పలు పెడుతున్న రైతులు



పాతపట్నం: లాబరలో వరిచేను కుప్ప పెడుతున్న రైతులు



ఎల్.ఎన్.పేట: ఎఫ్‌డీ పేట వద్ద వరిచేను కుప్పలపై కప్పిన టార్పలిన్లు



ఎల్.ఎన్.పేట: మిరియాపల్లి వద్ద ధాన్యం బస్తాలు తడవకుండా జాగ్రత్తలు



నరసన్నపేట: కంబకాయ కూడలి వద్ద ధాన్యం నిల్వలపై టార్పలిన్లు కప్పిన రైతులు

పొంచి వున్న ప్రమాదం



ఎల్.ఎన్.పేట మండలంలోని దబ్బపాడు నుంచి తెలికిపెంట గ్రామానికి వెళ్లే రోడ్డులో కడపలవాని గెడ్డ మీద నుంచి ఉన్న కల్వర్టు వంతెన కోతకు గురవుతోంది. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మించాలని కోరుతున్నారు. – ఎల్.ఎన్.పేట

వేప, రావి చెట్లకు కల్యాణం



లోక కల్యాణార్థం కోమర్తి బీసీ కాలనీలో వేప, రావి చెట్లుకు శుక్రవారం కల్యాణం నిర్వహించారు. శాస్త్రోక్తంగా సత్యవరాగ్రహారానికి చెందిన అనంత శర్మ ఆధ్వర్యంలో కింజరాపు రాజారావు, లోట్టి రవి దంపతులు కల్యాణం చేయించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కోమర్తి ఉప సర్పంచ్ లబ్బ రాజారావుతో పాటు స్థానిక మహిళలు పెద్ద పాల్గొన్నారు. – నరసన్నపేట

రోడ్డుపైనే మురుగునీరు



కొత్తూరు మండలంలోని పాలకొండ–హడ్డుబంగి రోడ్డులో నివగాం గ్రామం ఎస్సీ వీధి వద్ద రోడ్డుపై నిత్యం మురుగు నీరు నిల్వ అవుతోంది. ప్రధాన రహదారి కావడంతో ప్రతిరోజూ వందలాది వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. రోడ్డుకు ఇరువైపుల కాలువలు నిర్మించకపోవడంతో ఇళ్ల నుంచి వస్తున్న మురుగు నీటితో పాటు కుళాయిల నీరు ఇలా నిల్వ అవుతోంది. అందువలన అధికారులు స్పందించి నీరు నిల్వ అవ్వకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – కొత్తూరు

భూసార పరీక్షలు నిర్వహించాలి



భూసార పరీక్షల కార్డులు చూపుతున్న రైతులు

నరసన్నపేట: రైతులు విధిగా తమ పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించుకోవాలని వ్యవసాయాధికారి కె.సునీత సూచించారు. మండలంలోని మడపాంలో రైతులకు భూసార పరీక్షల అనంతరం కార్డులను రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల వలన అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. పొలంలో ఏ పోషకాలు తక్కువగా ఉన్నాయి, ఎటువంటి ఎరువులు వినియోగించాలి అనేది తెలుస్తుందన్నారు. దాని ప్రకారం ఎరువులు వినియోగిస్తే భూమి సారవంతమై, దిగుబడులు పెరుగుతాయని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ఉచితంగా ఈ పరీక్షలు నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రువ్వ వాసుదేవరావు, గొద్దు సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎస్.వి.రమణమూర్తి

ఆమదాలవలస: పురపాలక సంఘంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. మున్సిపాలిటీలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా కృష్ణాపురం, లక్ష్మీనగర్, మెట్టక్కివలస, మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, గేటు మొదలగు పాఠశాలలను సందర్శించారు. పురపాలక ఉపాధ్యాయులకు వెంటనే పీఎఫ్ ఖాతాలు తెరవాలని, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని, పండిట్ పోస్టుల ఉన్నతీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తమ్మినాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రమణ, జి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో సత్యనారాయణ

కొత్తూరు: గ్రామాల్లో చేపడుతున్న సీసీ రోడ్ల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా పరిషత్ ఉప కార్యనిర్వాహక అధికారి డి.సత్యనారాయణ స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా ఆయన సందర్శించారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. విధుల నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహించరాదన్నారు. అనంతరం మండలంలోని పారాపురంలో ఉన్న బీసీ శ్మశాన వాటికకు నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయించాలన్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో నీరజ, ఏవో బసవ రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

డిసెంబర్ 5న ప్రతిభ పరీక్ష

జలుమూరు: మండలంలోని శ్రీముఖలింగం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గీతా సత్సంగం ఆధ్వర్యంలో డిసెంబర్ 5వ తేదీన పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్ఎం మీన కేతన్ దాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ పాఠశాలల విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు రాధా గోవింద స్వామి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్ష రాయాల్సిన విద్యార్థులు డిసెంబర్ 2వ తేదీలోగా తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 80082 75805, 94906 38256, 95503 19773 నంబర్లను సంప్రదించాలని సూచించారు.